క్లుప్తంగా

బొట్లు పెడుతూ... ఆహ్వానిస్తూ



ముఖ్యమంత్రి పర్యటనకు బొట్టు పెట్టి ఆహ్వానిస్తున్న మెప్మా ఆర్పీలు

సామర్లకోట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సామర్లకోట పర్యటనకు వస్తున్న నేపథ్యంలో హాజరు కావాలని మహిళలకు బొట్లు పెట్టి మెప్మా ఆర్పీలు పిలుస్తున్నారు. సామర్లకోట ఈటీసీ లేఅవుట్‌లో 412 ఇళ్ల నిర్మాణం పూర్తి కావస్తోంది. ఈ గృహ సముదాయాన్ని ప్రారంభించడానికి ఈ నెల 12న సీఎం జగన్ సామర్లకోట వస్తున్నారని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు తెలిపారు. ముఖ్యమంత్రి మహిళలకు పెద్ద పీట వేయడంతో ఆయనకు కృతజ్ఞతలు చెప్పుకోవడానికి కార్యక్రమంపై తమకు సమాచారం ఇవ్వాలని మహిళా సంఘాల సభ్యులు మెప్మా సిటీ మిషన్ మేనేజరు సుజాతను కోరారు. దాంతో మెప్మా ఆర్పీలు సోమవారం నుంచి ఇంటింటికీ వెళ్లి మహిళా సంఘాల సభ్యులను బొట్లు పెట్టి ఆహ్వానిస్తున్నారు.

విభిన్న ప్రతిభావంతులకు సేవలందించడం ఓ వరం

పెద్దాపురం: విభిన్న ప్రతిభావంతులకు సేవలందించడం ఓ వరమని అన్నవరం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు, సామర్లకోట మున్సిపల్ కౌన్సిలర్ నేతల వెంకటలక్ష్మి అన్నారు. మండలంలోని పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో సోమవారం విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉదయం అల్పాహారం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులను సొంత పిల్లల్లా సాకి సేవలందిస్తున్న వీరబాబు, సత్య దంపతులను అభినందించారు.

కలెక్టర్‌కు మహిళా న్యాయవాది ఫిర్యాదు

కాకినాడ సిటీ: నా సొంత స్థలంలో ప్రహరీ కట్టుకుంటుంటే కొందరు వ్యక్తులు కక్షతో దానిని కూల్చివేసి నన్ను అనేక రకాలుగా వేధింపులకు గురి చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలంటూ సామర్లకోట బలుసులపేటకు చెందిన న్యాయవాది జంగం సంతోష్‌కుమారి సోమవారం కలెక్టర్ కృతికా శుక్లాకు ఫిర్యాదు చేశారు. గతంలో తాను సామర్లకోట మున్సిపల్ చైర్‌పర్సన్‌గా కాంగ్రెస్ తరఫున పోటీ చేశానని, అప్పట్లో తనను అనేక ఇబ్బందులకు గురిచేసిన వ్యక్తులే ఇప్పుడు రకరకాల మాటలతో ఇబ్బందులు పెడుతున్నారని వివరించారు. గతంలో ఏ వ్యక్తులు అయితే తనను ఇబ్బందులు పెట్టారో అదే వ్యక్తులు ఇప్పుడు మా పక్కనే ఉన్న చంద్రమ్మ, వీరభద్రం, మురళీకృష్ణ, సౌజన్యకృష్ణ, నాగేంద్ర, చంద్రశేఖర్ తదితరులతో దౌర్జన్యం చేయిస్తున్నారని విలేకర్లకు వివరించారు. అధికారులు తమకు న్యాయం చేయాలని, మానసికంగా లైంగిక వేధింపులకు, ఇబ్బందులకు గురి చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కృతికా శుక్లాను కలిసి కోరినట్లు వివరించారు.

రాష్ట్ర దళిత సదస్సును విజయవంతం చేయండి

పిఠాపురం: ఈనెల 15వ తేదీన కాకినాడ సూర్యకళా మందిర్‌లో దళిత సమస్యల పరిష్కారానికి ప్రత్యామ్నాయ విధానాలతో నిర్వహించనున్న రాష్ట్ర దళిత సదస్సును విజయవంతం చేయాలని కేవీపీఎస్ కార్మిక సంఘాల నాయకులు పిలుపు నిచ్చారు. విరవాడలో సోమవారం కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కె.సింహాచలం ఆధ్వర్యంలో రాష్ట్ర దళిత సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు.

ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా

పెద్దాపురం: స్థానిక టిడ్కో కాలనీ వద్ద మౌలిక వసతులు కల్పించాలంటూ సోమవారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయం వద్ద సోమవారం కాలనీవాసులు ధర్నా నిర్వహించారు. ఆర్డీఓ జేఎస్ రామారావుకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం నాయకులు నీలపాల సూరిబాబు, గడిగట్ల సత్తిబాబు, సిరిపురపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలను పెంచాలి

కాకినాడ సిటీ: ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలను పెంచాలని కాకినాడ రైల్వే స్టేషన్ మేనేజర్‌కు కాకినాడ జిల్లా ఏఐవైఎఫ్ నేతలు సోమవారం వినతి పత్రం అందజేశారు. ప్రతి రోజు దేశంలో వివిధ ప్రాంతాలకు కోట్లాది మంది ప్రజలు రైళ్లలోనే ప్రయాణం చేస్తున్నారన్నారు. కరోనా కారణంగా పాసింజర్ రైళ్లు నిలిపివేశారని, తర్వాత తిరిగి ప్రారంభం కావడం లేదని పేర్కొన్నారు. కేవలం ఎక్స్‌ప్రెస్ రైళ్లే తిరగడంతో తక్కువ జనరల్ బోగీలు ఉన్నాయన్నారు. దీనివల్ల పేద ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. జనరల్ బోగీలో ఒకరిపై ఒకరు నుంచుని ప్రయాణం చేస్తున్నారన్నారు. వందే భారత్ రైళ్లకు టిక్కెట్లు ధర సామాన్యులకు అందుబాటులో లేకుండా ఎక్కువ రేట్లు పెడుతున్నారన్నారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని రైల్వే శాఖ అధికారులకు అందజేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వై.బాబీ, సూరంపూడి నాని, ఎం.వీరబాబు, ఎస్.స్వామి పాల్గొన్నారు.

గృహ ప్రవేశాలే తరువాయి..

- సుందరంగా తీర్చిదిద్దిన టిడ్కో ఇళ్లు
- మున్సిపల్ అధికారులకు అప్పగిస్తూ లిఖితపూర్వకంగా ఆ సంస్థ లేఖ
- నివాసయోగ్యంగా మౌలిక వసతులు



సామర్లకోట జగ్గమ్మగారిపేటలోని టిడ్కో ఇళ్లు

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో ఈ నెలలో ఒక వైపు జగనన్న కాలనీ ఇళ్లు, మరో వైపు టిడ్కో ఇళ్లలో సామూహిక గృహ ప్రవేశాలు జరగనున్నాయి. ఈ మేరకు అధికారులు వాటిని మున్సిపల్ అధికారులకు స్వాధీనం చేస్తూ లేఖను అందజేశారు. దివంగతనేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పేదలకు ఇళ్ల నిర్మాణానికి భూముల కొనుగోలుకు నిధులు విడుదల చేశారు. దానిలో భాగంగా అప్పటి ఎమ్మెల్యే తోట గోపాలకృష్ణ ఆధ్వర్యంలో జగ్గమ్మగారిపేటలో 13 ఎకరాలు, ఉప్పువారి సత్రం వద్ద 12 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. మొదటి విడతలో 912 ఇళ్ల సముదాయంతో ఇళ్లు పూర్తి కావడంతో తరువాత అధికారంలోనికి వచ్చిన టీడీపీ నాయకులు ఆ ఇళ్ల సముదాయాన్ని అమ్మాణమ్మ అపార్టుమెంట్‌గా నామకరణం చేశారు. జగ్గమ్మగారిపేటలో మిగిలిన ఆరు ఎకరాలలోను, ఉప్పువారి సత్రం వద్ద భూములలోను టీడీపీ పాలనలోనే టిడ్కో ఇళ్ల నిర్మాణం ప్రారంభించి అసంపూర్తిగా వదలి వేశారు. ఈ ఇళ్ల లబ్ధిదారులు రూ.500, రూ.50వేలు, రూ.లక్ష చెల్లించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోనికి వచ్చిన తరువాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి టిడ్కో సంస్థకు చెల్లించాల్సిన మొత్తం బకాయిలను చెల్లించారు.

1,056 మంది లబ్ధిదారులు...

టిడ్కో ఇళ్లకు సంబంధించి జగ్గమ్మగారిపేటలో 416, ఉప్పువారి సత్రం వద్ద 640 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో కొంతమంది ఇప్పటికే గృహ ప్రవేశాలు చేశారు. వారికి ఇళ్లపై పూర్తి హక్కు లభించేలా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. దాంతో వారు అవసరమైతే ఆ ఇళ్లను విక్రయించుకునే వెసులుబాటు ఉంటుంది. రూ.500 చెల్లించిన వారికి 300 చదరపు అడుగుల విస్తీర్ణంలో 160 సింగిల్ బెడ్ రూమ్ ఇళ్లు, రూ.50వేలు చెల్లించిన వారికి 365 చదరపు అడుగుల విస్తీర్ణంలో 288 సింగిల్ బెడ్ రూమ్ ఇళ్లు, రూ.లక్ష చెల్లించిన వారికి 430 చదరపు అడుగుల విస్తీర్ణంలో 608 ఇళ్లను సిద్ధం చేశారు.

మౌలిక సదుపాయాలతో టిడ్కో ఇళ్లు...



టిడ్కో ఇళ్లను పూర్తి నివాసయోగ్యంగా సిద్ధం చేశారు. తాగునీరు, రోడ్లు, డ్రైన్ల నిర్మాణం పూర్తి చేశారు. జగ్గమ్మ గారిపేటలో టిడ్కో ఇళ్లను స్వాధీనం చేయడంతో మున్సిపాలిటీ నిర్వహణ బాధ్యతలు స్వీకరిస్తుంది. ఇళ్లలో మరమ్మతులు ఉంటే రెండు నెలల వరకు టిడ్కో సంస్థ చేస్తుంది. లబ్ధిదారులు ఇళ్లను స్వాధీనం చేసుకోవాలి.

– జె.రామారావు, మున్సిపల్ కమిషనర్, సామర్లకోట

సొంతింటి కల నేరవేరింది...



ఎంతో కాలంగా అద్దె ఇంటిలో ఉంటున్నాం. ఏటా పెంచే అద్దె భారంగా ఉండేది. జగ్గమ్మగారిపేటలో టిడ్కో ఇళ్లు లభించడంతో ఇంటిని స్వాధీనం చేసుకున్నాం. సొంతింటి కల నెరవేరడంతో ఆనందంగా ఉంది. విశాలమైన రహదారులతో కాలనీ సుందరంగా ఉంది.

– బలగ అనసూయ, టిడ్కో లబ్ధిదారు, సామర్లకోట.

లబ్ధిదారుల సొమ్ము పసుపు, కుంకుమకు..



టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు చెల్లించిన మొత్తాన్ని గత తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికల వేళ మహిళలకు పసుపు, కుంకుమగా మళ్లించింది. దాంతో టిడ్కో సంస్థకు బకాయిలు చెల్లించలేక పోవడంతో ఇళ్లను స్వాధీనం చేయడానికి టిడ్కో సంస్థ ముందుకు రాలేదు. సీఎం జగన్ మంచి మనసుతో బకాయి మొత్తాన్ని టిడ్కో సంస్థకు చెల్లించారు.

– దవులూరి దొరబాబు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్‌చైర్మన్, సామర్లకోట

కుమారరామంలో భక్తుల రద్దీ



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామివారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయానికి సోమవారం అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. స్వామివారికి ప్రీతైన రోజు కావడంతో తెల్లవారు జాము నుంచి భక్తులు స్వామి వారి తొలి అభిషేకం, తొలి పూజలను తిలకించడానికి బారులు తీరారు. పిఠాపురం మహారాజా గోత్రనామాలతో అర్చకులు వేమూరి సోమేశ్వరశర్మ, కొంతేటి జోగారావు, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు వినయ్‌లు తొలి పూజ, అభిషేకాలు చేశారు. తరువాత భక్తుల పేరున అభిషేకాలను స్వామివారికి నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు దేవస్థానం తరఫున అన్నదానం ఏర్పాటు చేశారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు, ట్రస్టు బోర్డు సభ్యు లు, దేవదాయశాఖ సిబ్బంది భక్తులకు సేవలందించారు. పూజలు అనంతరం సాయంత్రం స్వామి వారిని అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు అపూర్వ స్పందన



పవరలో రోగులకు మందులు అందజేస్తున్న తహసీల్దార్, డాక్టర్లు



నాగులాపల్లిలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సామర్లకోట: పట్టణ, మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లకు అపూర్వ స్పందన లభిస్తోంది. గత నెల 30న ప్రారంభం అయిన ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రతీ సచివాలయంలోను నవంబరు 10 వరకు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. సోమవారం మండల పరిధిలోని మైనర్ పవర గ్రామంలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష క్యాంపులో 384 మంది రోగులు పరీక్షలు చేయించుకున్నారు. వారికి ఉచితంగా మందులు అందజేశారు. తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్లు ప్రశాంత్, శివప్రసాద్, శ్రీహిమవతి క్యాంపునకు వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎస్ఎల్‌వి కుమారి మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష క్యాంప్‌లో రోగులకు గుర్తించి రోగాలను ఆయా కార్పొరేట్ ఆస్పత్రులకు ఆరోగ్య మిత్రల ద్వారా తరలించి ఉచితంగా వైద్యం అందిస్తామన్నారు. పేద ప్రజల వద్ద ఉన్న ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా రూ.ఐదు లక్షల వరకు కార్పొరేట్ ఆస్పత్రులల్లో ఉచితంగా వైద్యం అందిస్తారని చెప్పారు. ఆరోగ్యశ్రీ కార్డు ప్రభుత్వం గుర్తించిన 3,255 రకాల వ్యాధులకు వర్తిసుందన్నారు. ఈ మేరకు ప్రతీ ఒక్కరూ ఆరోగ్య సురక్ష క్యాంప్‌ను సద్వినియోగం చేసుకొని అనుమానాలను నివృత్తి చేసుకోవాలన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గ్రామ సమాఖ్య సభ్యులు పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాల ప్రదర్శనను నిర్వహించారు. డీఎల్‌డీఓ పి.నారాయణమూర్తి హెల్త్ క్యాంప్ పనితీరును పరిశీలించారు. గ్రామ సర్పంచ్ నాగనబోయిన సీతా మహాలక్ష్మీ, ఎంపీటీసీ సభ్యుడు నాగనబోయిన కామేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి తోట సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు వీరంరెడ్డి ఆనంద్, నాగనబోయిన రాజబాబు పాల్గొన్నారు. పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా మందులు అందజేశారు. పంచాయతీ, రెవెన్యూ, హెల్త్ సిబ్బంది సేవలందించారు.

మున్సిపాలిటీ పరిధిలో...

మున్సిపాలిటీ పరిధిలో గణపతినగరం అర్బన్ హెల్త్ సెంటర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారు. డాక్టర్లు సంజీవ్, తిరుమలాదేవి, జ్యోతి, భవ్యలు రోగులకు పరీక్షలు చేశారు. కౌన్సిలర్లు రెడ్నం సునీత, పాగా సురేష్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్త్ సిబ్బంది రోగులకు సేవలందించారు.

నాగులాపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష

కొత్తపల్లి: నాగులాపల్లి గ్రామ సచివాలయం-2 వద్ద సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి సౌజన్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచి వడిశెట్టి గౌరీ రాజేశ్వరి, ఎంపీటీసీ అనిశెట్టి వెంకట సుభాషిణి ప్రారంభించారు. జగనన్న ఆరోగ్య సురక్షలో 420 మందకి పరీక్షలు నిర్వహించినట్లు సౌజన్య తెలిపారు. ఈ ఆరోగ్య శిబిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో న్యూట్రిషన్ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పి.వెంకటనారాయణ, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ శ్రీనివాస్, అంగన్‌వాడీ సెక్టార్ సూపర్‌వైజర్ డి.సుజాత, పంచాయితీ కార్యదర్శి సత్యనారాయణ, హెల్త్ ఎగ్జిక్యూటర్ కృష్ణారావు, వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి స్పందనకు ఎనిమిది అర్జీలు

పెద్దాపురం: వారం వారం నిర్వహించే డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయా మండలాల నుంచి ఎనిమిది అర్జీలు అందినట్లు పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు తెలిపారు. పట్టణంలో టిడ్కో గృహాల కాలనీలో వసతులు కల్పించాలని, మా భూమికి పట్టాదారు పాస్ పుస్తకం కావాలని, భూతగాదా పరిష్కరించాలని, ఆక్రమణలు తొలగించాలని, భూ సర్వే చేయించి తమకు న్యాయం చేయాలని కోరుతూ ఎనిమిది వినతులు అందినట్లు ఆర్డీఓ వెల్లడించారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చిన ప్రతీ అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కంచరిందేకు చర్యలు చేపట్టామన్నారు. ఈ వారం వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులను ఆదేశించామని తెలిపారు. డీఎల్‌పీఓ బాలామణి, డీటీ భానుకుమార్, మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, ఏడీఏ దైవకుమార్, సీడీపీఓ ఉష పాల్గొన్నారు.



స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న ఆర్డీఓ సీతారామారావు

విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసానికి సెల్ఫీ విత్ టాపర్స్

సామర్లకోట: విద్యార్థుల్లో పరీక్షలంటే భయం పోగొట్టి ఆత్మ విశ్వాసం పెంపొందించడానికి ప్రభుత్వం సెల్ఫీ విత్ టాపర్స్ అనే కార్యక్రమం చేపట్టినట్టు కాకినాడ డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఆర్‌జే డేనియల్ రాజు పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులతో ఆయన ఫొటో దిగారు. ఇటీవల జరిగిన ఎఫ్ఏ 2 పరీక్షల వాల్యూయేషన్ పరిశీలించి నూరు శాతం ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. సీబీఎస్‌యూ విధానంలో జరుగుతున్న పరీక్ష విధానాన్ని పరిశీలించారు. సీబీఎస్‌యూ విధానంలో ఉన్న ప్రత్యేకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మండల విద్యాశాఖాధికారి పి.పుల్లయ్య, హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ, ఉపాధ్యాయులు జి.గోవిందు, కేవీవీ సత్యనారాయణ, ఎఎల్‌వీ కుమారి, ఎ. శ్రీవల్లి పాల్గొన్నారు.



సామర్లకోట బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులతో డీవైఈఓ

ఏఐడీసీ చాంపియన్ షిప్ క్రికెట్ పోటీలకు గొల్లప్రోలు విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పిఠాపురం: ఆల్ ఇండియా డొమెస్టిక్ క్రికెట్ చాంపియన్ షిప్ పోటీలకు గొల్లప్రోలు మండలం చెందుర్తికి చెందిన గొల్లప్రోలు బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి పిల్లి వీరమణికుమార్ ఎంపికై నట్టు పాఠశాల ప్రదానోపాధ్యాయుడు ఎ.రాంబాబు తెలిపారు. ఈనెల 13వ తేదీ నుంచి 19వ తేదీ వరకూ గోవాలో నిర్వహించనున్న ఆల్ ఇండియా డొమెస్టిక్ క్రికెట్ చాంపియన్ షిప్ పోటీల్లో తెలంగాణా క్రికెట్ అకాడమి తరఫున ఆడనున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు క్రికెట్ అకాడమీ హైదారాబాద్ నుంచి ఆహ్వానం అందినట్టు ఆయన తెలిపారు. ఇటీవల ఇండియన్ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రైజింగ్ స్టార్ ప్రీమియర్ లీగ్ అండర్-17 క్రికెట్ స్టేట్ టోర్నమెంటులో విద్యార్థి పిల్లి వీరమణి కుమార్ విశేష ప్రతిభ కనబర్చినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని సోమవారం పాఠశాలలో ఉపాధ్యాయులు రమాదేవి, ఎస్.గణేష్ గోవింద్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఈవీఎంల పరిశీలనకు సంసిద్ధం కావాలి

కాకినాడ సిటీ: ఈ నెల 16వ తేదీ నుంచి కాకినాడ అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించనున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్‌ల మొదటి స్థాయి పరిశీలన ఏర్పాట్లను ఆర్‌డీవో ఎన్‌వీ సత్యనారాయణ పర్యవేక్షించారు. ఈ నెల 16వ తేదీ నుంచి అంబేడ్కర్ భవన్‌లో రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పరిశీలనకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లు ముమ్మరం చేయాలని ఆదేశించారు.

ఆయన చొరవకు అభినందనలు



సామర్లకోట బ్రిడ్జి దిగువ భాగంలో గొయ్యిని పూడ్చించిన ట్రాఫిక్ ఎస్సై

సామర్లకోట: వాహన చోదకులు పడుతున్న ఇబ్బందులను గమనించిన ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు తన వంతు ఏదో విధంగా సహాయం చేయాలని ఆలోచన చేశారు. దీనిలో భాగంగానే స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జి దిగువ భాగంలో పడిన పెద్ద గొయ్యిని పూడ్చించి చిన్న వాహన చోదకుల మనన్నలు పొందారు. ఇటీవల భారీ వాహనాల రాకపోకలు కారణంగా బ్రిడ్జి దిగువ భాగంలో గొయ్యి పడిపోయింది. దాంతో తరుచూ చిన్న వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన ట్రాఫిక్ ఎస్సై ఆ రోడ్డులో సోమవారం రాత్రి కాంక్రీట్ వాహనాలు వెళుతున్న సమయంలో వాటి నుంచి సిమెంట్ కాంక్రీట్‌తో గొయ్యిని పూడ్చించారు. ఈ మేరకు బ్రిడ్జి దిగువ భాగంలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా సిబ్బందిని నియమించి వాహనాలను మళ్లించే విధంగా ఏర్పాటు చేశారు. దాంతో చిన్న వాహనాల చోదకులు ట్రాఫిక్ ఎస్సై పని తీరును అభినందించారు. ఇటీవల రైల్వే స్టేషన్ ఇన్‌గేట్‌లో ఏర్పడిన గొయ్యి పూడ్చడంలోను ఎస్సై చొరవ తీసుకున్నారని స్థానికులు తెలిపారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు సత్యసౌమ్య ఎంపిక



పిఠాపురం: పంజాబ్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి అండర్ 19 ఫుట్‌బాల్ పోటీలకు గొల్లప్రోలు మండలం తాటిపర్తి ప్రభుత్వ హైస్కూలు విద్యార్థిని వేంపల సత్యసౌమ్య ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగమణి తెలిపారు. జాతీయ క్రీడలకు ఎంపికైన విద్యార్థినిని గ్రామ సర్పంచ్ కట్టా బుల్లేశ్వరరావు, ఉప సర్పంచ్ దాసం వెంకటేష్, వైస్ ఎంపీపీ నేమాని ఆదివిష్ణుం, పీటీసీ నూకరాజు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

హూ.. హ్హా..లో అదరహో!

కరాటే పోటీల్లో పతకాలు సాధిస్తున్న బాలభవన్ చిన్నారులు



బాలభవన్‌లో కరాటే శిక్షణ పొందుతున్న చిన్నారులు

బోట్‌క్లబ్: వారంతా సామాన్య కుటుంబాలకు చెందిన బాలికలు. తమకిష్టమైన కరాటే క్రీడల్లో రాణించాలని కలలుగన్నారు. వాటిని నిజం చేసుకునేందుకు నిత్యం శ్రమిస్తూనే ఉన్నారు. చదువుతోపాటు కరాటే సాధన రోజువారీ కార్యక్రమాల్లో భాగంగా మార్చుకున్నారు. వీరంతా బాలభవన్‌లో కేవలం రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 50 నామ మాత్రపు రుసుంతోనే సాధన చేస్తూ పతకాలు పంట పండించడం విశేషం. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన అంతర్జాతీయ దక్షిణ భారత రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో 30కిపైగా బంగారు, 28 రజత , 25 కాంస్య పతకాలు సాధించి బాలభవన్ విద్యార్థులు కరాటేలో ఔరా అనిపించుకొంటున్నారు. బాలభవన్‌లో కరాటేతోపాటు సంగీతంలోను ఉచిత శిక్షణ ఇస్తున్నారు.

చిత్రలేఖనంలోనూ..



తనకు వచ్చిన పతకాలు చూపుతున్న సామిక

స్థానిక గాంధీనగర్‌కు చెందిన కేఎస్ఎస్ సామిక 5వ తరగతి చదువుతోంది. తండ్రి హరికృష్ణ పీఆర్ కళాశాల్లో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. 2020 నుంచి బాలభవన్‌లో శిక్షణ పొందుతోంది. సామిక కరాటేతోపాటు చిత్రలేఖనంలోనూ రాణిస్తోంది. గత సంవత్సరం అమలాపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించింది. విశాఖలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో రెండు విభాగాల్లో బంగారు, రజత పతకాలు సాధించింది. ఈ ఏడాది విశాఖలో జరిగిన దక్షిణ భారత స్థాయి పోటీల్లో రజత, కాంస్య పతకాలు సాధించింది. భవిష్యత్‌లో కరాటేలో రాణించి వైద్యురాలు కావాలన్నది తన ధ్యేయమంటోంది ఈ బాలిక.

ఉచిత శిక్షణ ఇస్తున్నాం



ప్రతీ రోజు మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 7 గంటల వరకూ శిక్షణ ఉంటుంది. ఆదివారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ శిక్షణ ఇస్తున్నాం. ఈ శిక్షణ ఉచితం. ప్రతీ శుక్రవారం సెలవు. ప్రస్తుతం 400 మంది చిన్నారులు ఇక్కడ అడ్మిషన్లు పొందారు. ప్రతీ రోజు 100 మందిపైగా పిల్లలు వారికి ఇష్టమైన రంగంలో శిక్షణ పొందుతున్నారు.

– ఎ.శారద, బాలభవన్ సూపరింటెండెంట్

కరాటేలో రాణిస్తున్న హారిక



పతకాలు చూపుతున్న హారిక

కాకినాడ ఇంద్రపాలేనికి చెందిన నీలి శ్రీ వీర హారిక ప్రస్తుతం శ్రీ నగర్ మున్సిపల్ స్కూల్‌లో 6వ తరగతి చదువుతోంది. తండ్రి చిన్నారావు, తల్లి నాగలక్ష్మి ఇంటి వద్ద చిన్న హోటల్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. బాల భవన్‌లో ఉచితంగా కరాటే వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నారని తెలిసి తమ కుమార్తెను 2021లో అక్కడ చేర్పించారు. హారిక కరాటేలో చూపుతున్న ప్రతిభను గమనించి కరాటే మాస్టర్ మరింత ప్రోత్సహించారు. 2022లో సామర్లకోటలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లోను, విశాఖలో జరిగిన పోటీల్లోను రజత పతకాలను గెలుచుకుంది. ఈ ఏడాది విశాఖలో జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో బంగారు, రజత పతకాలు సాధించింది. ఇటీవల రాష్ట్ర స్థాయి పోటీల్లో రెండు విభాగాల్లో బంగారు, కాంస్య పతకాలు సాధించింది. కరాటే అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే తన ధ్యేయమని హారిక తెలిపింది.